బద్ధ విరోధులు ?

—"రాజా"

గేటు దాటి విక్టోరియా కాలేజి ఆవరణలో ప్రవేశించాడు ప్రవీణ్‌కుమార్.

టైం చూసుకొన్నాడు. పదింపావు అయింది.

గబగబా కాలేజీ బిల్డింగ్స్ చేరుకొన్నాడు. వాచ్ మెన్‌ను అడిగి తెల్సుకొని సెకండ్ ఫ్లోర్‌లో ఉన్న ఫస్ట్ బి కాం క్లాస్ చేరుకొన్నాడు.

ఇంగ్లీష్ లెక్చరర్ ధారాళంగా చెప్పుకుపోతున్నాడు పాఠం.

మే ఐ కమీన్ సర్. 'గుమ్మంలో నిలబడ్డ ప్రవీణ్ కుమార్ అడిగాడు. తలెత్తిచూసాడు లెక్చరరు. క్లాస్‌లో స్టూడెంట్సంతా అతనివైపు చూస్తున్నారు.

'యస్ కమీన్!'

లోనికి నడిచాడు ప్రవీణ్‌కుమార్. క్లాసంతా నిశ్శ

బ్ధంగా ఉండటంవలన అతని బూట్లశబ్దం ప్రతిధ్వనిస్తోంది.

"ఐ యామ్ ప్రవీణ్‌కుమార్. నేటినుంచీ కాలేజీలో జాయిన్ అవుతున్నాను" అన్నాడు లెక్చరువైపు చూస్తూ దగ్గరగా నిల్చుని.

ఆశ్చర్యంగా చూసాడు లెక్చరరు. అప్పటికే కాలేజి బిగినయి రెండు నెలలు దాటింది. కోర్సులుకూడా చాలా వరకు పూర్తయ్యాయి. అందుకే ఆశ్చర్యం కల్గింది లెక్చ రరుకు.

"యస్ సర్ కొన్ని కారణాలవలన ఈ లేట్ జరి గింది," ప్రిన్సిపాల్ పర్మిషన్ లెటరు అందించాడు.

అందుకొని దానిని పరిశీలించి ప్రక్కనేఉన్న అటెం డెన్స్ రిజిష్టరులో తోసాడు లెక్చరరు.

ప్రవీణ్‌కుమార్ వైపు చూసి అన్నాడు. 'వెల్ మై యంగ్ బాయ్! వెళ్ళి సీట్లో కూర్చో.'

'థాంక్యూ సర్,' అంటూ స్టూడెంట్స్‌వైపు కదిలాడు ప్రవీణ్‌కుమార్.

మొదటి 'రో'లో కూర్చున్న స్టూడెంట్స్‌లో ఒకతను ప్రక్కకు జరిగి ప్లేస్ ఇచ్చాడు. కూర్చొంటూ ఒకసారి క్లాస్‌రూం అంతా పరీక్షగా చూసాడు.

సుమారు అరవైమందుంటారు స్టూడెంట్స్. వారిలో ఇరవైమంది గరల్స్. క్లాస్‌రూం చాలా విశాలంగా ఉంది. అతనివైపే ఆసక్తిగా చూస్తున్నారందరూ.

అతని దృష్టి ఒక్కొక్కరినీ దాటుకొంటూ చివరి వరుసలో మొదటగా కూర్చొన్న స్టూడెంట్‌పై పడింది.

ఉలిక్కిపడ్డాడు ప్రవీణ్‌కుమార్. కనుబొమ్మలు ముడి వడ్డాయి.

కళ్ళు చిట్లించి మళ్ళీ చూసాడు. ఎందుకో అతని శరీరం జలదరించినట్లయింది.

అదే ముఖం. అదే ఆకారం, అదే పెర్సనాలిటీ! ఎక్కడో చూసినట్లయింది. కాని ఎంత ఆలోచించినా జ్ఞాపకంమాత్రం రావటంలేదు.

"వాట్ మిస్టర్ ప్రవీణ్? ఏమిటీ ఆలోచిస్తూ నిలబడి పోయావ్?" ఆశ్చర్యంగా చూస్తూ లెక్చరరు అడిగాడు.

"ఎక్స్‌క్యూజ్ మీ సర్," కూర్చొన్నాడు ప్రవీణ్ కుమార్ తన సీట్లో అతడినిగురించే ఆలోచిస్తూ.

లెక్చరరు తిరిగి తన ధోరణిలో పడ్డాడు.

2

క్లాసవ్వగానే బయటకు వెళ్ళిపోయాడు లెక్చరరు. క్లాసంతా గోలగా తయారయింది.

బుక్స్‌పట్టుకొని క్లాస్‌రూంలోంచి బైట వరండాలోకి వచ్చాడు ప్రవీణ్ కుమార్.

గంట పదకొండయింది. వెచ్చగా వీస్తున్న గాలితెరలను బిల్డింగ్ ప్రక్కనున్న చింతచెట్లు చల్లబరచి చుట్టూ పంపిణీచేస్తున్నాయి. పిట్టగోడపై చేతులాన్చి దూరంగా కన్పిస్తున్న నైట్ కాలేజీ షెడ్లవైపు చూస్తున్నాడు ప్రవీణ్ కుమార్.

"మిస్టర్ ప్రవీణ్‌కుమార్..."

ఉలిక్కిపడి వెనక్కి తిరిగాడు ప్రవీణ్. అతనే, బుక్స్ స్టయిల్‌గా పట్టుకొని అదోలాచూస్తున్నాడు తనవైపు. మళ్ళీ సంచలనం రేగింది ప్రవీణ్‌కుమార్‌లో.

"యస్..." అన్నాడు తనలోని కలవరపాటు బైటకు కనబడనీయకుండా అదిమిపెట్టడానికి ప్రయత్నిస్తూ.

"నా పేరు జైరాజ్. మీతో కాస్సేపు మాట్లాడాలి!" అన్నాడతను దూరంగా నింగీ నేలా కలిసినట్లనిపిస్తున్న శూన్యంలోకి చూస్తూ. అతని మొఖం ఎందుకో వివర్ణ మైంది.

"మాట్లాడండి!"

"యస్!" వివర్ణమైన తన ముఖాన్ని చేతితో రుద్దు కొంటూ అన్నాడు జైరాజ్. రెండు నిముషాలు మౌనంగా గడిచిపోయాయి.

"మిస్టర్ ప్రవీణ్ కుమార్, దయచేసి మీరు ఈ కాలేజీ మానేసి ఎక్కడికైనా వెళ్ళిపోగలరా?"

"ఎందుకని?" ఆశ్చర్యాన్ని అణచుకుంటూ అడిగాడు ప్రవీణ్ కుమార్.

"చెబుతాను. మిస్టర్ ప్రవీణ్ కుమార్, నాకు మీ పేరు తప్ప మీ రెవరో ఎక్కడినుంచి వచ్చారో ఎక్కడ వుంటు న్నారో తెలీదు. మిమ్మల్ని నేను చూసింది కొన్ని నిము షాల క్రితమే. కాని మిమ్మల్ని చూస్తోంటే ఈ కొద్ది సమయంనుంచే కాక ఎప్పటినుంచో మీరు నాకు తెల్సినట్లు, అన్యాయంగా నాకు తీరని ద్రోహం చేసినట్లు అన్పిస్తోంది. మిమ్మల్ని చూసిన మరుక్షణం నుంచీ నాలో చెప్పలేని సంఘర్షణ రేగి మీపట్ల నాకు తీవ్రమైన పగనూ, కోపాన్ని రగుల్చుతోంది. మీరంటే భరించలేని కసి పెరిగిపో తోంది...ఎందుకో తెలియటంలేదు," ఆగాడు జైరాజ్.

"ఐ. సీ. కాని మిస్టర్ జైరాజ్, మీరన్నట్లుగానే మిమ్మల్ని చూడగానే నాలోనూ సంచలనం రేగింది. కాని మీలో ఏర్పడినట్లు ద్వేషాసూయలకు బదులు మీరంటే జాలి, అభిమానం ప్రేమ కల్గుతున్నాయి నాకు." అన్నాడు

ప్రవీణ్‌కుమార్ అడ్డొస్తూ.

"అదంతా అనవసరం. మర్యాదగా రేపే కాలేజీవదిలి వెళ్ళిపోతే ఇద్దరికీ మంచిది. దయచేసి ఈ జన్మలో నాక్కనిపించవద్దు మళ్ళీ. మూరంగా ఇక్కడినుంచి వెళ్ళకపోతే తగిన ప్రతిఫలాన్ని అనుభవిస్తారు. ఇకపై మీమీది ద్వేషాన్ని అణుచుకొనే శక్తి నాకులేదు. ఈ కాస్త సమయంలో నే మిమ్మల్ని చూసి భరించలేని నేను ప్రతీరోజూ మిమ్మల్ని చూస్తూ నాలోని ద్వేషాన్ని అణుచుకోవడమనేది అసంభవం. వివేకవంతంగా ప్రవర్తిస్తారని ఆశిస్తాను. గుడ్‌బై." అనేసి విసురుగా బైటకు వెళ్ళిపోయాడు జైరాజ్.

జైరాజ్ వింత ప్రవర్తన ప్రవీణ్‌కుమార్‌కు ఆశ్చర్యాన్ని, ఆసక్తినీ కల్గించింది. ఆలోచిస్తూ అతను వెళ్ళిన వైపే చూస్తూ కాలేజ్‌నుంచి వెళ్ళకుండానే జైరాజ్ సంగతేమిటో తేల్చుకోవాలనే నిశ్చయానికొచ్చాడు.

మరో రెండునిముషాల్లో అతను కూడా బైటకొచ్చాడు.

3

వారం రోజులు గడిచాయి.

బీచ్‌లో కూర్చొన్న ప్రవీణ్‌కుమార్ వాచ్ చూసుకొన్నాడు. గంట ఆరయింది. లేచినిలబడి ఫాంట్‌కు అంటుకొన్న ఇసుక దులుపుకొని ముందుకు నడిచాడు.

ఒకవైపు సూర్యుడస్తమిస్తోంటే మరోవైపు చీకటి తెరలు ముసురుకొంటున్నాయి.

బీచ్‌లో అప్పటివరకూ కూర్చొన్న జంటలు ఇళ్ళకు బైలుదేరాయి. పనేమీ లేకపోవడం వల్లన ఎక్కడ

కెళ్ళాలో తోచలేదు ప్రవీణ్‌కుమార్‌కు.

సినిమాకు పోదామనిపించి ముందుకు కదిలాడు.

ప్రవీణ్‌కుమార్ థియేటర్ చేరేటప్పటికి బిగిన్ అయిందికాబోలు బైట తిరుగుతున్న జనం కంగారుగా లోనికి పరుగిడుతున్నారు.

బుకింగ్‌లో టికట్ తీసుకొని లోనికి వెళ్ళాడు. అతను సీట్లో కూర్చొనేప్పటికి పూర్తయింది ఇండియన్ న్యూస్ రివ్యూ. రిలీఫ్‌గా నిట్టూర్చాడు బోరింగ్ తప్పినందుకు.

ఇంటర్వెల్ అయింది. రిచర్డ్ బర్టన్ క్లింట్ ఈస్ట్‌ఉడ్ లను తలచుకొంటూ బైటకు వచ్చాడు.

కేంటీన్‌లో కెళ్ళి కాఫీ తీసుకొంటున్న ప్రవీణ్‌కుమార్ ఉలిక్కిపడ్డాడు. దూరంగా నిలబడి తనవైపే చూస్తూ ఎవరితోనో మాట్లాడుతున్న జైరాజ్‌ను చూడగానే.

ప్రవీణ్‌కుమార్ తనవైపు చూడగానే ముఖం త్రిప్పుకొన్నాడు జైరాజ్ కాని అతనిపక్కనే నిలబడి మాట్లాడుతున్న ఇద్దరూ మాత్రం తనవైపు అదోలా చూస్తున్నారు.

తనవైపు చూడకపోయినా జైరాజ్ ఆ యిద్దరకూ తన గురించే ఏదో చెపుతున్నారని అర్థమైంది ప్రవీణ్ కుమార్‌కు. ఖాళీకప్పును డస్ట్‌బిన్‌లో పడేసి లోనికి వెళ్ళిపోయాడు ప్రవీణ్‌కుమార్.

రాత్రి పదిగంటలకు థియేటర్ నుంచి ఆఖరుగా బైటకొచ్చాడు ప్రవీణ్‌కుమార్. హుషారుగా ఈలవేసూ నడవసాగాడు. వారంరోజుల క్రితం జైరాజ్ పలికిన మాటలు గుర్తుకొచ్చి నవ్వుకొన్నాడు ప్రవీణ్‌కుమార్.

రోజూ కాలేజీలో అతని ప్రవర్తనను పరిశీలించేవాడు తను. తనని చూడగానే అతని వదనంలో కోపఛాయలు

స్పష్టంగా కన్పించేవి. చాలావరకూ క్రోపాన్ని అణుచుకో డానికి ప్రయత్నించేవాడు సాధ్యమైనంత వరకూ తన నుంచి తప్పుకొనేవాడు అటువంటివాడు ఈరోజు తన గురించి వాళ్ళతో ఏమిటి చెబుతున్నాడు ?

ఆలోచిస్తూ నడుస్తున్న ప్రవీణ్‌కుమార్ తృళ్ళిపడి ఆగిపోయాడు.

రోడుకి అడ్డంగా ఇద్దరు నిలబడి తనవైపే చూస్తు న్నారు వెనక్కితిరిగి చూశాడు ప్రవీణ్‌కుమార్. మరో ఇద్దరు బాక్ చేసారక్కడ.

ఆశ్చర్యంగా చూశాడు వాళ్ళవైపు "ఎవరు వీళ్ళు ? ఎందుకు తననిలా అటకాయించారు ?" అర్థం కాలేదు ప్రవీణ్‌కుమార్.

ఆ వీధిలో ఎలక్ట్రిక్ పోల్స్‌కు లైట్స్ లేకపోవటం వలన చీకటిగా నిర్మానుష్యంగా ఉండి ముఖాలు సరిగా కన్పించటంలేదు.

"ఎవరు మీరు ? ఎందుకు నన్నిలా..." ఆశ్చ ర్యంగా అడగబోతున్న ప్రవీణ్‌కుమార్ మాటలు పూర్తి కాకముందే ఎదురుగా నిలబడ్డ ఇద్దరిలో ఒకడు మెరుపులా ముందు కడుగువేసి, పిడికిలి బిగించి ప్రవీణ్‌కుమార్ పొట్టలో గుద్దాడు.

నరాలు తెగి ప్రేవులు కదిలినంత బాధ కల్గింది ప్రవీణ్‌కుమార్‌కు. తేరుకొనేలోగా ప్రక్కనున్నవాడు గడ్డంక్రింద కొట్టాడు. కరంట్ షాక్‌లా తగిలింది. ఎగిరి నేలకరచుకొన్నాడు ప్రవీణ్.

నెమ్మదిగా లేవబోయాడు. మరుక్షణంలోనే వెనక నున్నతని బూట్‌కాలు విసురుగా నడుం తాకింది. చక చకా

మరో నాలుగు తన్నులు తన్ని ఎలావచ్చారో అలాగే మాయమయ్యారు ఆ నలుగురూ.

నీరసంగా లేచి నిల్డ్దాడు ప్రవీణ్‌కుమార్. మోకాలు కలుక్కుమంది. అయినా బాధను సహిస్తూలేచి నిలబడి గోడనానుకొని రెండు నిముషాలు అలుపు తీర్చుకొన్నాడు.

బట్టలు చిరిగిపోయాయి. అక్కడక్కడా శరీరం కొట్టుకుపోయి చుర చురా మండుతోంది.

కసిగా పళ్ళు కొరుక్కున్నాడు ప్రవీణ్‌కుమార్. వాళ్లెవరో ఎలాగయినా తెలుసుకొని ఎముకలు విరగ గొట్టాలన్పించింది.

తూలుతూ ముందుకు నడిచాడు వాళ్ళ గురించే ఆలోచిస్తూ అప్పుడు గుర్తొచ్చారు థియేటర్లో కన్పించిన జైరాజ్ స్నేహితులు.

4

క్లాస్‌లోకి అడుగు పెట్టాడు ప్రవీణ్‌కుమార్. మౌనంగా వెళ్ళి తన సీట్లో కూర్చొన్నాడు. తలెత్తి చూడగానే ప్రక్క బెంచ్‌లో కూర్చొని తనవైపే చూస్తున్న జైరాజ్ కన్పించాడు.

కోపంగా పిడికిలి బిగించాడు ప్రవీణ్. రాత్రి తగిలిన దెబ్బల తాలూకు నెప్పులు ఇంకా తగ్గలేదు. దవడలు బిగించి పళ్ళు కొరుకొన్నాడు.

"వెధవలు! అనవసరంగా తనని రెచ్చగొట్టారు. మంచిగా వదిలేస్తే చాతకాని వాడిలా చూస్తారు. గట్టిగా బుద్ధి చెప్పాలి," గుణుక్కొన్నాడు ప్రవీణ్‌కుమార్.

కామర్స్ హెడ్ ఎకౌంట్స్ మొదలెట్టాడు. ఎకౌంట్ బుక్ తీసి ప్రోబ్లమ్ చేయసాగాడు ప్రవీణ్‌కుమార్.

పావుగంట గడిచింది. ఇంకో పావుగంటలో క్లాసయి పోతుంది. చకచకా చెప్పుకుపోతున్నాడు కామర్స్ హెడ్ తన గంభీర కంఠంతో.

"ఎక్స్‌క్యూజ్‌మీ సర్!"

ఆగిపోయాడు లెక్చరరు. అతని వాక్ ప్రవాహానికి అడ్డుపడింది.

"వాట్ హేపెండ్ మైనాటర్?" ఆడిగాడు ఒక చేతితో తన బట్ట తల సవరించుకొంటు ముందు సీట్లో కూర్చొన్న మిస్ హేలవైపు చూసి.

"యస్. సర్! వెనక నుంచెవరో ఈ రాళ్లతో మమ్మల్ని కొడుతున్నారు సర్!" ముందుకువచ్చి చేతి లోని గులకరాళ్ళను టేబిల్‌పై పెడుతూ అంది హేల.

ఒకసారి వాటినిచూసి స్టూడెంట్స్ వైపు దృష్టి సారించాడు కామర్స్ హెడ్.

"హూ ఈజ్ దట్ ఈడియట్?" కోపంగా గర్జించాడు.

ఎవరూ మాట్లాడలేదు.

మరలా అడిగాడు. ఎవరూ సమాధానం చెప్పకపోవటంతో రెచ్చిపోయాడు.

"రెండు నిముషాలు టైమిస్తున్నాను. మర్యాదగా రాళ్ళు విసిరిన రాస్కెల్ ఎవరో లేచి నిలబడండి. లేకపోతే క్లాసంతా సస్పెండ్ చేయిస్తా. ఎవరూ పరీక్షల కెళ్ళకుండా చేస్తా." అరిచాడు హెడ్.

రెండు నిముషాలు గడిచాయి.

ఎవరూ కదలలేదు. వాచీ చూసుకొని క్లాసంతా ఒకసారి చూసాడు. అంతా కళ్ళప్పగించి తనవైపే చూస్తుంద

టంతో చిరాకెత్తింది హెడ్‌కు.

"ఆల్‌రైట్! ఒకసారి సస్పెండు చేస్తేగాని మీ కెవరికి బుద్ధి వచ్చేలా లేదు." అంటూ బైటకెళ్ళటానికి ఉద్యుక్తుడయాడు.

అంతలో చటుక్కున లేచి నిలబడ్డాడు జైరాజ్. కోపంగా చూసాడు జైరాజ్ వైపు హెడ్.

"రాస్కెల్! ఆడపిల్లలపై రాళ్ళిసరటానికాసీ పేరెంట్స్ నిన్నిక్కడికి పంపించింది?" అరిచాడు.

"ఎక్స్‌క్యూజ్‌మీ సర్, రాళ్ళు విసిరింది నేను కాదు. విసిరిన వారెవరో చెప్దామని నిలబడ్డాను," అన్నాడు జైరాజ్ సీరియస్‌గా.

కామర్స్ హెడ్ చల్లబడ్డాడు.

"ఎవరతను?" అడిగాడు.

అంతా తన వైపే ఆసక్తిగా చూస్తూండటం గమనించాడు జైరాజ్.

"ఎవడా రాస్కెల్?" అసహనంగా మళ్ళీ అడిగాడు హెడ్.

"మిస్టర్ ప్రవీణ్‌కుమార్!"

"ప్రవీణ్‌కుమారా?" ఆశ్చర్యపోయాడు హెడ్. బుద్ధిమంతుడని పించుకొన్న ప్రవీణ్‌కుమార్ ఇలా ఆడపిల్లలపై రాళ్ళు విసిరాడంటే నమ్మలేక పోయాడు.

తెల్లబోతూ నిలబడ్డాడు ప్రవీణ్‌కుమార్. అతనికంతా అయోమయంగా ఉంది.

జైరాజ్? అతను రాళ్ళు విసురుతుండగాను నువ్వు చూసావా?" అనుమానంగా అడిగాడు హెడ్.

"యస్ సర్! నేనే కాదు నా స్నేహితులు కూడా

చూసారు," ధృఢంగా అన్నాడు జైరాజ్. వెంటనే అతని స్నేహితులు ఆ మాటను ధృవపరిచారు, తాముకూడా చూసామంటూ.

"వాట్ మిస్టర్ ప్రవీణ్ ? ఏమిటి నీ సంజాయిషీ ?"

అయోమయంలో కొట్టుమిట్టాడుతున్న ప్రవీణ్‌కుమార్ ఏదో చెప్పబోయాడు. కాని అతని మాటను లెక్చరర్ వినిపించుకోలేదు.

"ఆల్‌రైట్, నువ్వేదో బుద్ధిమంతుడవనుకొన్నాను గాని ఇలా ఆడపిల్లలపై రాళ్ళు విసిరే రౌడీ రాస్కెల్ వనుకోలేదు.

నువ్వు చేసిన ఈ వెధవపనికి శిక్షగానిన్ను పదిహేను రోజులు కాలేజీనుంచి సస్పెండ్ చేస్తున్నాను. ఇకనువ్వు వెళ్ళొచ్చు," పుస్తకంలో తల దూర్చాడు కామర్సు హెడ్.

తల తిరిగిపోయింది ప్రవీణ్‌కుమార్‌కు. ఇంక తనేం చెప్పినా వినేట్టులేడు హెడ్. స్టూడెంట్స్ అంతా తన వైపు జాలిగా చూస్తున్నారు. జైరాజ్‌వైపు ఒకసారి కసిగాచూసి బైటకు వెళ్ళిపోయాడు ప్రవీణ్‌కుమార్.

మరో ఐదు నిముషాలలో క్లాసయింది. కామర్సు హెడ్ బట్టతల సవరించుకొంటూ వెళ్ళిపోయాడు.

జైరాజ్ అతనిని ఫ్రండ్స్‌తోకల్సి బైటకు వచ్చాడు. ప్రవీణ్‌కుమార్ వైపుచూసి పరిహాసంగా నవ్వి ముందుకు నడిచాడు.

తనచుట్టూ చేరుతున్న ఫ్రండ్స్‌ను విదిలించుకొంటూ గబగబా వెళ్ళి నడుస్తున్న జైరాజ్ భుజంపై చేయివేసి తన వైపు త్రిప్పుకొన్నాడు ప్రవీణ్‌కుమార్.

మెరుపులా వెనక్కి తిరిగాడు జైరాజ్ అతని భుజం

పట్టుకొని వరండా మూలకు లాక్కెళ్ళాడు ప్రవీణ్ కుమార్.

"నిజం చెప్పు! నేను హేలపై రాళ్ళువిసిరినా? విసురుతుండగా నువ్వుచూసావా?" పిడుగులా అడిగాడు ప్రవీణ్ కుమార్.

"లేదు." అన్నాడు జైరాజ్ ప్రశాంతంగా. "అయితే రాళ్ళు విసిరిందెవరు?"

"నేను."

"మరి నేను విసిరానని ఎందుకొ చెప్పావ్?" కోపంగా అడిగాడు ప్రవీణ్‌కుమార్.

జైరాజ్ ఒకసారి కోపంగా చూసాడు ప్రవీణ్‌ను.

"ఎందుకా? పగ! నీపై కోపం! నా మాటలు లక్ష్యపెట్టక తగిన ప్రతిఫలాన్ని అనుభవిస్తున్నావ్." అంటూ విసురుగా వెళ్ళిపోయాడు జైరాజ్.

నివ్వెర పోయి నిలబడిపోయాడు ప్రవీణ్‌కుమార్.

5

సాయంత్రం ఐదయింది.

సూర్యుడు పశ్చిమాద్రిని చేరుకొంటున్నాడు. ఎండలో వేడి తీక్షణత తగ్గి నులివెచ్చగా ఉన్నాయ్ కిరణాలు.

ప్రకృతి సౌందర్యానికి పరవశిస్తూ మెల్లిగా నడుస్తున్నాడు ప్రవీణ్‌కుమార్. ఈవెనింగ్ వాకింగా ఆ రోజు బీచ్‌రోడ్ వైపు వచ్చాడతను.

అటు, ఇటూ తిరుగుతూ చిరుతిళ్ళు అమ్మే కుర్రవాళ్ళ కేకలతో కోలాహలంగా ఉంది బీచ్.

సముద్రంపై వీచే గాలి ప్రశాంతంగా తాకుతూ మనస్సుకు హాయిని చేకూరుస్తోంది. ఆలోచిస్తూ నడుస్తున్న

ప్రవీణ్‌కుమార్ బీచ్‌ను దాటి దూరంగా వచ్చేయటం గమనించలేదు.

దాదాపు సిటీ లిమిట్స్ దాటి వచ్చేయటంవలన ఎవరూ లేక సముద్రతీరం నిర్మానుష్యంగా ఉంది. దూరంగా ఏవో పల్లెగుడిసెలు మాత్రం కన్పిస్తున్నాయి.

ఇసుకలో దిగి కొంతదూరం నడిచి ఒకచోట కూర్చొన్నాడు ప్రవీణ్‌కుమార్. చుట్టూ మసకచీకట్లు క్రమ్ముకొంటున్నాయి.

సముద్రం హోరెక్కువయి విపరీతంగా ఘోష పెడుతోంది. రోడ్డమ్మట అరగంటకో కారు వెళ్ళటం వలన మిగిలిన సమయాలలో నిశబ్దం దట్టంగా ఆవరించుకొని ఉంది.

జైరాజ్ గుర్తొచ్చాడు ప్రవీణ్‌కుమార్‌కు. కోపంగా తిట్టుకొన్నాడు. వారం రోజులుగా కాలేజీకి వెళ్ళక బోర్ కొడుతోంది. తనపై అతను.ఎందుకు పగబూనాడో ఎంత ఆలోచించినా అర్థంకాలేదు ప్రవీణ్‌కు.

గంట గడిచింది.

జరిగిన సంఘటనలను గుర్తుకు తెచ్చుకొని జైరాజ్‌ను తల్చుకొంటూ నిటూర్చాడు ప్రవీణ్‌కుమార్.

చీకట్లు బాగా ముసురుకొన్నాయ్. పల్లెవాళ్ళ కొంపల్లో దీపాలు వెలిగాయ్.

లేచినిలబడి బట్టలకంటుకొన్న ఇసుక దులుపుకొని ముందుకు కదిలాడు టార్చ్ వెలిగిస్తూ.

కొంచెం దూరం వెళ్ళగానే 'కెవ్వు' మంటూ కేక విన్పించింది.

ఠక్కున ఆగి నలుదిశలా పరిశీలించి చూశాడు. తీరం

పొడుగునా సరుగుడు తోటలున్నాయి. చెట్ల వెనకనుండి ఆకాశంలోకి ఎగబ్రాకుతున్నాడు చంద్రుడు ప్రకాశిస్తూ.

రెండు నిముషాలు గడిచాయి. నిలబడి చుట్టూ చూస్తూన్న ప్రవీణ్‌కుమార్‌కు విసుగెత్తింది. భ్రమేమో ననుకొంటూ ముందుకు కదలబోయాడు.

అంతలో మళ్ళీ విన్పించిందా ఆర్తనాదం. స్త్రీ ఆర్త నాదం. స్పష్టంగా విన్పించింది సరుగుడుతోటలోనుంచి.

నిలబడలేకపోయాడు ప్రవీణ్‌కుమార్. చెట్లవైపు పరిగెత్తి తోటలో జొరబడ్డాడు.

చంద్రకాంతి చెట్లమధ్యనుంచి దారిచేసుకొంటూ ఇసుకను చేరి ప్రతిఫలిస్తోంది.

పరిగెడుతున్న ప్రవీణ్‌కుమార్ చటుక్కున ఆగిపో యాడు. ఎదురుగా కన్పిస్తోన్న దృశ్యాన్ని చూడగానే అతని పిడికిళ్ళు కోపంతో బిగుసుకొన్నాయి. చెట్లమధ్య విశాలమైన ప్రదేశంలో ఓ అమ్మాయిచుట్టూ నిలబడి నవ్వు తున్నారు నలుగురు. వాలకం చూస్తే స్టూడెంట్స్‌లా గున్నారు.

అర్థమైంది ప్రవీణ్‌కుమార్‌కు. వాళ్ళవైపు పరిశీలనగా చూస్తూ రెండడుగులు ముందుకేసాడు. చంద్రకాంతివలన వాళ్ళనీడలు ఇసుకలో మూడురెట్లు పెద్దవి పడుతున్నాయి.

నలుగురివైపు పరిశీలనగా చూస్తున్న ప్రవీణ్‌కుమార్ ఉలిక్కిపడ్డాడు. అతనిదృష్టి ఒక వ్యక్తిపై నిలిచిపో యింది.

వారం రోజులక్రితం తిన్న తన్నులు గుర్తుకొచ్చాయి ప్రవీణ్‌కుమర్‌కు. మరుక్షణమే థియేటర్లో జైరాజ్‌తో మాట్లాడుతూ అతను తనవైపు చూసిన చూపులు కూడా

గుర్తుకొచ్చాయి.

కోపంతో పళ్ళు కొరుక్కున్నాడు ప్రవీణ్‌కుమార్. రక్తం నరాల్లో వరవడిగా పరుగులు తీసింది.

రాస్కెల్స్ ఆనాడు చీకటిలో అకస్మాత్తుగా దాడి చేసి తన్నినందుకు బదులు తీర్చుకోవాలి, అనుకొంటూ వాళ్ళవైపు కదిలాడు.

అడుగుల చప్పుడు విని తృళ్ళిపడ్డారు నలుగురూ. అనుమానంగా చుట్టూ చూసారు.

సరుగుడుచెట్ల వెనకనుంచి తమవైపు వస్తున్న ప్రవీణ్ కుమార్ పై నిలిచిపోయింది వారిదృష్టి.

ఎదురుగా వచ్చి నిలబడ్డాడు ప్రవీణ్. ముఖాముఖాలు చూసుకొన్నారు నలుగురూ.

"నువ్వా ?" అన్నాడు ఒకడు బలవంతంగా గొంతు పెకలించుకొని.

"అవును, నేనే ! మర్యాదగా ఆ అమ్మాయిని వదిలేయండి," కోపంగా అన్నాడు ప్రవీణ్.

అంతవరకూ భయంతో వణికిపోతూ నిలబడ్డ ఆ యువతి పరిగెత్తుకువెళ్ళి ప్రవీణ్‌కుమార్ వెనక నక్కింది.

"వదలకపోతే ?" ఆదోలా అన్నాడు మరొకడు.

నవ్వాడు ప్రవీణ్‌కుమార్. "అర్థంలేని ప్రశ్న ! నేనే తీసుకెళ్తాను వెంటబెట్టుకొని."

"మొన్న తన్నిన తన్నులకింకా బుద్ధిరాలేదు కాబోలు !" అంటూ మెరుపులా ముందుకు దూకాడు ఒకడు.

సందేహం తీరిపోయింది ప్రవీణ్‌కుమార్‌కు, ఆ రాత్రి తనపై చేయిచేసుకొన్న నలుగురూ వీళ్ళేనని.

అప్పటివరకూ గుప్పెటలో ఉన్న ఇసుక వాడి

ముఖంపై కొట్టాడు ప్రవీణ్‌కుమార్. వాడికళ్ళు భగ్గుమన్నాయ్. ఆలశ్యంచేయకుండా పిడికిలి బిగించి వాడి గడ్డంక్రింద గుద్దాడు. ఎగిరి ఇసుకలో పడ్డాడు వాడు.

మరుక్షణమే నివ్వెరబోయి చూస్తున్న మిగిలిన ముగ్గురిపైకి లంఘించాడు ప్రవీణ్‌కుమార్. అతని పిడికిలి రైలింజన్ రాడ్‌కంటే వేగంగా పనిచేసింది. వాళ్ళ కళ్ళముందు రంగులు కదిలాయ్.

"రాస్కెల్స్ ప్రమత్తుడై వస్తున్న వ్యక్తిపై ఆకస్మిక దాడి జరిపి నాలుగు తన్నడం గొప్పకాదు. ఇదీ గొప్పదనం," అంటూ మరోనాలుగు గుద్దులుగుద్దాడు కసిగా.

ప్రతిఘటించే శక్తిలేక నిస్సహాయంగా కూలిపోయారు ముగ్గురూ.

గట్టిగా వళ్ళు విరుచుకొని వెనక్కి తిరిగాడు ప్రవీణ్‌కుమార్. ఆ యువతి కన్పించకపోవటంతో క్షణకాలం కంగారుపడ్డాడు. కిందనున్న టార్చ్ తీసికొని వెతుకుతూ సరుగుడుతోట బైటకొచ్చాడు.

దూరంగా రోడ్‌మీద సిటీవైపు పరుగుతీస్తున్న ఆ అమ్మాయిని చూడగానే నవ్వొచ్చిందతనికి. హుషారుగా ముందుకు కదిలాడు.

6

మరోరెండు నెలలు సాఫీగా గడిచాయి.

కాలేజ్ ప్రారంభించబడిన అరగంటకు నోటీస్ కాగితాన్ని పట్టుకొని లోపలకొచ్చాడు ప్యూన్. లెక్చరర్ నోటీస్ ఓసారి పూర్తిగాచదివి, సంతకం పెట్టి, విషయం చెప్పసాగాడు.

యన్.సి.సి. కాడేట్స్ అంతా మేజర్ అజిత్‌సింగ్

గారిని సాయంత్రం ఓసారి కల్సుకోవాలి. అండర్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ ఇప్పుడు మేజర్‌గార్ని అర్జంటుగా మీటవ్వాలట ......"

లేచినిలబడ్డాడు ప్రవీణ్‌కుమార్.

"మిస్టర్, యు ఆర్ అండర్ ఆఫీసర్?"

"యస్ సర్"

"వెరీగుడ్... నౌయు కెన్ గో,"

బైటకు కదిలాడు ప్రవీణ్.

ఐదునిముషాలలో యన్.సి.సి. క్వార్టర్స్ చేరుకొన్నాడు.

కాలేజి బిల్డింగ్‌కు కొంచెం దూరంలో ఉంది చుట్టూ చింతచెట్లతో ఎప్పుడూ చల్లగా ఉంటుందా ప్రదేశం. యన్. సి. సి. గార్డ్స్ చెట్లక్రింద నీరు మరగబెట్టి 'పుల్‌త్రూ'లతో రైఫిల్ గొట్టాలు క్లీన్ చేస్తున్నారు.

ఆఫీస్ రూంలోకి వెళ్ళాడు ప్రవీణ్. ఫైళ్ళు చూస్తున్న మేజరు బూట్లశబ్దం విని తలెత్తి చూడగానే అటెన్షన్‌లో నిలబడి సెల్యూట్ చేసాడు.

"టేక్ యువర్ సీట్ మిస్టరు ప్రవీణ్."

"థాంక్యూ సర్" యిర్చొన్నాడు.

"యస్ మిస్టరు ప్రవీణ్‌కుమార్, ఈ సంవత్సరం మన యన్.సి.సి. కాంప్ ఉదయపూరు ఔట్‌స్కర్ట్‌లో ఇవ్వబడింది. పదిహేను రోజులు కాంప్. వచ్చే శనివారం బయలు దేరాలి. కాడెంట్లందర్నీ సిద్ధపరుచు," అన్నాడు మేజర్ అజిత్‌సింగ్.

"ఉదయపూర్?" ఉలిక్కిపడ్డాడు ప్రవీణ్‌కుమార్.

"ఎక్స్క్యూజ్‌మి సర్. ఉదయపూర్ రాజస్తాన్ స్టేట్

శ్రోనిది కదూ?"

"యస్ నీవెప్పుడన్నా ఉదయపూర్ వెళ్ళావా?"

సమాధానం చెప్పలేదు ప్రవీణ్‌కుమార్. అతని మనసులో ఆరవెల్లి కొండలు మెదలుతున్నాయ్. ఆలోచిస్తూ ఉండిపోయాడు

"వాట్ మిస్టర్ ప్రవీణ్, ఏమిటి ఆలోచిస్తూ ఉండి పోయావ్?" అడిగాడు మేజర్.

"ఏమీలేదు సర్." కుర్చీలోంచి లేచాడు.

"వెంటనే అన్ని ఏర్పాట్లూ చెయ్యి. విష్ యు గుడ్ లక్." అన్నాడు మేజర్ తనూ కుర్చీలోంచి లేస్తూ.

అటెంషన్‌లో నిలబడి సెల్యూట్ చేసి బైటకొచ్చాడు ప్రవీణ్‌కుమార్.

అతని మనసంతా వికలంగా ఉంది. ఏవేవో గత స్మృతుల తాకిడికి గురవుతోందతని హృదయం. వాటిలో కెల్లా ముఖ్యపాత్ర వహించినవి ఆరవెల్లి కొండలు. వాటి ఆకారాలు అతని కళ్ళముందు గోచరిస్తున్నాయ్.

భరించలేనట్టుగా తలవిదిల్చి కాలేజీవైపు కదిలాడు.

7

రాజస్థాన్‌లోని ప్రాచీన పట్టణాలలో ఒకటైన ఉదయపూరు నాటి నాగరికతకు తార్కాణంగా నిల్చిన పట్టణం. దానికి నిదర్శనంగా నేటికీ చెక్కుచెదరకుండా నిల్చి ఉన్న మహారాజ వైభవం, కోటలు, రాతి కట్టడాలు రుజువు చేస్తున్నాయ్.

ఉదయపూర్‌కు నలభై మైళ్ళ దూరంలో ఉన్న ఓచిన్న గ్రామ పరిసరాలలో క్యాంప్ చేసింది యన్.సి.సి బెటాలియన్.

టార్పాలిన్స్‌తో గుడారాలు నిర్మించారు కాడెట్స్. అన్నిపనులు పూర్తిచేసిన తర్వాత మేజర్ అజిత్‌సింగ్ అనుమతితో గ్రామంలోకి బయలు దేరారంతా సరదాగా. మేజరు అజిత్‌సింగ్ కాక మరో నలుగురు ఇన్‌స్ట్రక్టర్స్ మాత్రం కాంప్‌లో ఉండిపోయారు.

ఇసుక ప్రదేశమవటం వలన ఉదయం తొమ్మిది గంటలకే వాతావరణం వేడెక్కుతోంది. ఎక్కడచూసినా గుర్రాలు, ఒంటెలు కన్పిస్తున్నాయి.

అందరితో కల్సి గ్రామంలోకి నడిచాడు ప్రవీణ్ కుమార్. దూరంగా జైరాజ్ ఒక్కడే నడుస్తున్నాడు.

ఉదయపూర్‌లో అడుగు పెట్టినప్పటినుంచీ అతనిలో భావాలు మారటం గమనించాడు ప్రవీణ్‌కుమార్. సంఘర్షణ ఏదో అతనిలో జరుగుతోందని స్పష్టంగా తెలియజేస్తోంది అతని వదనం.

సరదాగా కబుర్లు చెప్పుకొంటూ గ్రామంలోకొస్తున్న కాడెట్లందరివైపు ఆశ్చర్యంగా చూస్తున్నారు ప్రజలు. ఎరుపురంగు కల్గి ధృఢంగా ఎత్తుగా ఉన్న రాజస్తానీయులు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నారు. తలపై ఉన్న తెల్లటి పాగాలు చూడటానికి వింతగా ఉన్నాయ్.

అటూ ఇటూ పరుగులు తీస్తున్న అశ్వాలు, అక్కడి వాతావరణం చూస్తోంటే కౌబాయ్ పిక్చర్స్ జ్ఞాపకం వచ్చాయ్ ప్రవీణ్‌కుమార్‌కు.

గ్రామందాకా కలసికట్టుగావచ్చిన స్టూడెంట్స్ అంతా తలో వైపుకు విడిపోయారు.

ఆలోచిస్తూ నడుస్తున్న ప్రవీణ్‌కుమార్ గ్రామందాటి అవలి పొలిమేరలు చేరుకున్నాడు. అక్కడక్కడ

చెదురు మదురుగా గుడిసెలు కన్పిస్తున్నాయ్. అంతా ఒకసారి పరిశీలనగా చూసి వెనక్కి తిరగబోతూ త్రుళ్ళి పడ్డాడు.

అతని చూపు దూరంగా ఇసుకలో ఉన్న పొడుగైన రాతి స్తంభంలాంటి దానిపై నిల్చింది. బాగా ఎత్తుగా ఉండి కొంచెం ప్రక్కకి వరిగినట్లుగా కన్పిస్తోందది.

దానివైపు పరుగుతీసాడు. దగ్గర చేరుకొని దానినే పరీక్షగా చూస్తూన్న ప్రవీణ్‌కుమార్‌ను వళ్ళంతా చెమటలు పట్టాయ్. నరాలలో రక్తం వడివడిగా పరుగులు తీసింది.

అతని కళ్ళముందు చీకట్లు క్రమ్ముతోంటే ఆ చీకటిలో ఏవేవో మరచిపోయిన గతస్మృతులు తిరుగాడ సాగాయ్.

8

సుమారు ఇరవై సంవత్సరాలక్రితం. ఓ రోజు ఉదయం ఐదు గంటలు కావస్తోంది. తూర్పు దిక్కున ఆకాశం తెల్లటి మసక వెల్తురు క్రమ్ముకొంటోంది.

వేగంగా దూసుకువచ్చిన రెండు అశ్వాలు ఎత్తైన ఆ స్థంభం ముందాగాయ్. చాలాదూరంనుంచి ఆగకుండా ప్రయాణంచేసినట్లు తెలుపుతూ అశ్వాలు రెండూ ఆయాసంతో నురుగులు క్రక్కుతున్నాయ్.

వాటిపైనుంచి క్రిందకు దూకారు అజిత్, ప్రతాప్‌లు. ఆ ఎత్తైన రాతిస్థంభంవైపు నడిచారు.

"ఇదేనేమో మాప్ చూడు ప్రతాప్" అన్నాడు అజిత్.

బలంగా ఎత్తుగాఉన్నారిద్దరూ. దళసరి ఉన్నికోట్లు వారి శరీరాలను కప్పుతున్నాయ్. నడుముచుట్టూ ఆ ఉన్ని

కోట్లను బిగిస్తూ తూటాలబెల్టు ఉంది. దానికి వ్రేళ్ళాడుతూ లెదర్ కేస్‌లో రివాల్వర్ ఉంది. చేతికో రైఫిల్స్ ఏ క్షణంలోనైనా ప్రేలే పొజిషన్‌లో ఉన్నాయ్.

కోటుజేబులోంచి మాప్ బైటకు తీశాడు ప్రతాప్. సగమే ఉందాంట్లో. రెండవ సగమున్న మాప్‌ను అజిత్ నుంచి తీసుకొని దగ్గరగా చేసి చూసాడు. అతని ముఖం వికసించింది. సంతోషంతో గట్టిగా అరిచి అజిత్‌ను కౌగలించుకొన్నాడు.

అరగంటతర్వాత తిరిగి అశ్వాలు రెండూ ఆ ఇద్దరితో కల్సి వేగంగా ఆ రాతిస్తంభానికి తూర్పుదిక్కుగా సాగిపోయాయి.

వారి కళ్ళముందు మాప్ ప్రతిరూపం కదలాడుతోంది. మరో ముప్పై మైళ్ళు పోతే అర్ధచంద్రాకారపు రాతిశిలలు తగులుతాయ్. అది రెండవ గుర్తు. అక్కడనుంచి దక్షిణం వైపు ప్రయాణం.

సుమారు రెండుగంటలు గడిచాయ్. సూర్యుడు ఆకాశంలో ఎగబ్రాకాడు. నులివెచ్చని సూర్యుని కిరణాలు తీక్షణంగా మారాయి.

దూరంగా అర్ధచంద్రాకారపు శిలలు కన్పించగానే హుషారుగా అశ్వాలను అదిలించారిద్దరూ. మాప్‌లో గుర్తించినట్లే ఉన్నాయవి.

"రెండవ గుర్తు!" అన్నాడు ప్రతాప్.

'ఇంకో రెండు దాటాలి. ఆపైన ఆరవెల్లి కొండలు. ఆ కొండలలోనే ఉంది రెండు తరాల క్రితం అంతరించిపోయిన ఉదయపూర్ మహారాజ్ గారి వంశపారంపర్యంగా స్తున్న నిధి' అనుకొన్నాడు అజిత్.

ఉదయపూర్ మహారాజుగారి కాలంలో దివాణంలో ఆయనకు నమ్మకమైన ఉద్యోగులుగా ఉంటూ, ఆయన అనుమతితో ఈ నిధి రహస్యాన్ని తమకు మాప్‌రూపంలో అందజేసిన, తమ తాతలకు మనస్సులోనే కృతజ్ఞతలు అందజేసుకొన్నారు ఇద్దరూ.

"ఇదే వేగంతో ప్రయాణంచేస్తే త్వరలోనే గమ్యం చేరుకోవచ్చు!" అన్నాడు ప్రతాప్ గుర్రాన్ని అధిరోహిస్తూ. అజిత్ మాట్లాడకుండా అతన్ని అనుసరించాడు.

మధ్యాహ్నానికల్లా మిగిలిన రెండు గుర్తులనూ దాటేశారు. దూరంగా అరవెల్లి కొండలు కన్పించసాగాయ్. వేగంగా పరుగులుతీస్తున్న అశ్వాల గిట్టల తాకిడికి ఇసుక గాల్లోకి ఎగురుతోంది. ఎటుచూసినా చిన్నచిన్న రాళ్ళ గుట్టలు.

ముందుకు కదులుతున్న అజిత్‌కు ఒకచోట పర్వత పీఠంనుంచి లోనికి అశ్వంపట్టేంతటి ఇరుకైన మార్గం కన్పించింది. వెనక వస్తున్న ప్రతాప్‌ను పిల్చి ఆ మార్గాన్ని చూపించాడు

మాప్ చూసి అదేనని తెలియగానే లోనికి చొరబడ్డారిద్దరూ తమ అశ్వాలతో. మొదట్లో పర్వతపు గోడలు ఇరుప్రక్కలా వరుసుకొన్నా రానురాను మారం విశాలమై ప్రయాణానికి అనువుగా మారింది. పావుగంట అనంతరం అవతలివైపుకు బైటపడ్డారిద్దరూ.

నలువైపులా కొండలు ఆవరించి ఉన్నాయ్. మధ్యలో ఇసుక. అక్కడక్కడ రాతిగుట్టలు. అన్నిటికన్నా ఎత్తుగా చిన్నసైజు కొండలా ఉన్న రాతిగుట్టను చూడగానే ఆనందంతో వళ్ళు పులకరించిందిద్దరికి. అక్కడకు

చేరుకోడానికి ఎక్కువ సమయం పట్టలేదు.

చేతిలోని త్రాడును గిరగిరా త్రిప్పి పైకి విసిరాడు అజిత్. రాతికితగిలి ఖంగుమంటూ శబ్దంచేసింది కొక్కెం. నాలుగైదుసార్లు గట్టిగా విదిల్చి చూసి పట్టుచిక్కిందన్న నమ్మకం ఏర్పడ్డాక త్రాడు సహాయంతో కొండపైకి చేరుకొన్నారిద్దరూ.

ఎదురుగా సొరంగం. లోనికి నడిచారు.

చాలా చిన్నసొరంగం అది. చుట్టూ చూసిన ప్రతాప్‌కు మార్గం కన్పించలేదు. అయోమయంగా చూసాడు అజిత్. ప్రతాప్‌కు ఏదో అనుమానం వచ్చింది.

రాతిగోడ దగ్గరకు నడిచి జాగ్రత్తగా తడమటం ప్రారంభించాడు. కాస్సేపటికి అతని ప్రయత్నం ఫలించినట్లు ఒకచోట చిన్న రాతిపలక ప్రక్కకు జరిగింది. లోనికి మెట్లు కనిపించాయ్.

జాగ్రత్తగా దిగారు లోనికి. కటికచీకటిని ఛేదిస్తూ సన్నటి వెలుగు. వెలుగువస్తున్న వైపు వెళ్ళగానే ఒక్కసారి కళ్ళు జిగేలుమన్నాయి ఇద్దరకూ.

ఆ గుహలో గోడల నిండా అమర్చబడిన మణుల కాంతికి ఇద్దరి కళ్ళూ తట్టుకోలేక రెప రెప లాడాయ్.

ఆ కాంతిలో గుట్టలు గుట్టలుగా పోసి ఉన్న వజ్రాలు, మణులు, బంగారు కడ్డీలు కన్పించాయి. చూస్తోంటే మతి పోతోంది ఇద్దరకూ.

తాము కలలో కూడా ఊహించలేనంత సంపద, వెయ్యి తరాల పాటు కూర్చుని తిన్నా తరగనంత నిధి. అంత ధనాన్ని చూసి ఒక్క క్షణం చలించిన అజిత్ మనస్సు అత్యాశకులోనయింది.

అతని వైపే చూస్తున్న ప్రతాప్ అజిత్ చెయ్యి రివాల్వర్ పై పాకడంతో మెరుపులా ప్రక్కకు దూకుతూ రివాల్వర్ బయటకు లాగాడు. ధన్‌మంట రివాల్వర్ బుల్లెట్ అజిత్ గుండెల్లో దిగబడింది.

కూలిపోతూ ట్రిగ్గర్ నొక్కాడు అజిత్. బుల్లెట్ మిస్ అయి కప్పుకు తగిలింది. మరు క్షణంలోనే సారంగం పై భాగం ద్వారాన్ని మూసేస్తూ అడ్డంగా కూలిపోయింది.

అదిరి పడాడు ప్రతాప్. కంగారుగా ద్వారం వైపు పరిగెత్తాడు కాని ఫలితం లేకపోయింది. ఒక్క క్షణం అతని కళ్ళలో చావు భయం కదులాడింది. అజిత్ వైపు చూసాడు.

గుండె పట్టుకొని బాధతో మెలికలు తిరుగుతున్న అజిత్ పెదవు పై కసితో కూడిన చిన్న నవ్వుకదులాడింది. ప్రతాప్ వైపు క్రూరంగా చూస్తూ ఏదో అనబోయాడు కాని అతని పెదవులు విడిపడలేదు.

తల వాల్చేశాడు అజిత్.

ప్రతాప్ గుండెల్లో గుర్రాలు పరిగెత్తాయ్ అంతకు ముందు హృదయాన్ని ఆనందంతో జోలలాడించిన నిధి ఇప్పుడు కళ్ళముందు మృత్యుదేవతలా కదూలాడుతోంది.

ఎదురుగా అజిత్ శవం.

గుహలో తను బందీ

జీవ సమాధి అయిపోయినట్లనిపించింది ప్రతాప్‌కు అతి త్వరలోనే తిండీ, నీరూ లేక మల మలా మాడి చస్తాననే విషయం స్ఫురణకు రాగానే భయంతో గుండె ఆగి కుప్పలా కూలిపోయాడు.

9

"ప్రతాప్" అన్న అరుపు విన్పించి ఉలిక్కిపడి అటు చూశాడు ప్రవీణ్‌కుమార్.

ఎదురుగా జైరాజు నిలబడి ఉన్నాడు. ఆ వేశంతో ఊగిపోతూ "జైరాజ్

"కాదు. అజిత్‌ను,' గర్జించాడు జైరాజ్

"అజిత్'......?

"అవును. మిత్రుడిగా ఉంటూ నువ్వు చేసిన మోసానికి బలైపోయిన అజిత్‌నే."

"షటప్, ఎవరిది మోసం? నా ప్రాణాలు కాపాడుకోడానికి నిన్ను చంపాను, తప్పా?" అరిచాడు ప్రవీణకుమార్ కోపంగా.

"రాస్కెల్...ఆ నాటి కసి ఈ నాడు తీర్చుకొంటాను నిన్ను చంపి ఆ నిధిని మిళ్ళీ స్వాధీన పర్చుకొంటాను." దూకాడు జైరాజ్ ప్రవీణ్‌కుమార్ పైకి.

ఎగిరి దూరంగా పడ్డాడు ప్రవీణకుమార్ లేచేలోగా తిరిగి గుండెలపై బలంగా తన్నాడు జైరాజ్.

ఒక్క క్షణం కళ్ళ ముందు ఏమీ కన్పించలేదు ప్రవీణ్‌కుమార్‌కు, మరు క్షణమే తేరుకొన్న అతను. మీదకు వస్తోన్న బూట్ కాలును పట్టుకొని మెరుపులా మెలి తిప్పాడు.

బాధగా కేకేసాడు జైరాజ్. రెండో కాలు పట్టు తప్పటంతో క్రింద పడ్డాడు. చటుక్కున లేచి నిలబడ్డాడు ప్రవీణకుమార్. కాలికున్న యన్. సి. సి. బూటుతో ఎడా పెడా తన్నడం ప్రారంభించాడు.

భాధతో ఉక్కిరి బిక్కిరయ్యాడు జైరాజ్. అతని

ముఖం రక్తసిక్తంగా మారింది. ఆతని నడుము చుట్టూ ఉన్న యన్. సి. సి. బెల్ట్ పట్టుకొని పైకి లేపి పొట్టలో గుద్దాడు ప్రవీణకుమార్. దూరంగా వెళ్ళి పడాడు జైరాజ్, స్పృహలేకుండా.

అతని వైపోసారి చూసి వేగంగా గ్రామంలోకి కదిలాడు ప్రవీణకుమార్. అతని మెదడులో నిధికి దారి స్పష్టంగా కన్పిస్తోంది.

10

గాలిలో ఉరకలు వేస్తూ ముందుకు సాగుతోంది. అశ్వం. తలపై ఉన్న కౌబాయ్‌హాట్ వెనక్కి నెట్టి బ్యానక్యులర్స్‌తో చుట్టూ చూసాడు ప్రవీణకుమార్.

దూరంగా ఆరవెల్లి కొండలు కన్పిస్తోన్నాయ్. నడుము బెల్ట్‌కు అమర్చిన రివాల్వర్‌ను వకసారి తడుముకొని అశ్వాన్ని మరింత వేగంగా ఉరికించాడు.

అతని మనస్సులో చిన్న అనుమానం కదులాడు తోంది

'ఈ ఇరవై సంవత్సరాలలో పర్వతపీఠంలోంచి నిధికి వెళ్ళే చీలిక ప్రకృతి సిద్ధంగా మూసుకుపోలేదు కదా?' అనుకొన్నాడు. అదేకాని జరిగితే లోనికి చేరుకోడం చాలా ప్రయాసతో కూడిన పని. కాలినడకతో కొండ ఎక్కి దిగాలి.'

అతనిలా ఆలోచనలలో తేలియాడుతున్న సమయంలో అశ్వం ఆరవెల్లి కొండలు దరిదాపులకు చేరుకొంది.

జాగ్రత్తగా పరిశీలిస్తూ మలుపువైపు సాగాడు. త్వరలోనే అతని ప్రయత్నం ఫలించింది. ఆ సన్నటి చీలికను చూడగానే అతని హృదయం ఆనందంతో

ఉప్పొంగింది. క్రిందికి దిగి అశ్వాన్ని నడిపించుకొంటూ లోనికి జొరబడ్డాడు.

అవతలికి చేరుకోగానే తిరిగి గుర్రాన్ని అధిరోహించి మధ్యలో కన్పిస్తోన్న నిధి గుట్టవైపు సాగాడు.

సరిగా ఇరవై ఏళ్ళ క్రితంలాగే ఉందా గుట్ట. వ్రేలాడుతోన్న త్రాడుని చూడగానే మళ్ళీ గుర్తొచ్చింది గతం. చీకిపోయి దారాలుగా ఊడిపోయిఉన్న ఆ త్రాడు ఏ కొంచెం బలంగాలాగినా తెగిపోయేలా ఉంది.

'ఈ త్రాడు వెంబడే పైకివెళ్ళిన తాము తిరిగి బైటకు రాలేదు.' అనుకొంటున్న ప్రవీణ్‌కుమార్‌కు ఆ నాడు తమతోకల్సి లోనికి వచ్చిన అశ్వాలు గుర్తుకొచ్చాయి. "ఏమయ్యాయో అవి ?"

గట్టిగా తల విదిలిస్తూ తనతో తెచ్చుకొన్న త్రాడు పైకి విసిరాడు. పట్టు చిక్కిందన్న నమ్మకం ఏర్పడ్డాక చర చరా ప్రాకుతూ పైకి చేరుకొన్నాడు.

చక చకా సొరంగం లోనికి నడిచి మెట్లుదిగి క్రిందకు చేరుకొన్నాడు. అంతా చీకటిగా ఉండటంవలన ముందేమీ కన్పించటం లేదు తన చేతిలో టార్చి వెలిగించాడు. ఎదురుగా సొరంగం నిధి ద్వారానికి అడ్డుగా గోడలా కూలిపోయింది.

రెండు నిమిషాలు ఆలోచించి తనతో తెచ్చిన గన్ పౌడర్ పాకెట్ విప్పి గోడమొదట్లోఉన్న చిన్నకంతలో కూరాడు వత్తి పర్చుకొచ్చి అంటించి మెట్లవెనక నక్కాడు

'ధన్'మంటూ పెద్ద విస్ఫోటంతో ప్రేలి గోడలాఉన్న రాళ్ళగుట్ట కూలిపోయింది. ఒక్కసారిగా గదంతా నిధి

వెలుగుతో నిండిపోయింది. మెరుపులా లేచి కాళ్ళకు రాళ్ళు తగులు న్నా లెక్కచేయక నిధివైపు పరుగు తీసాడు.

మూలగా రెండు అస్థిపంజరాలు శిథిలావస్తలోపడి ఉన్నాయ్. తుప్పుపట్టిన తుపాకులు, చిరిగి పేలికలైన తోలు ముక్కలు కన్పించాయ్ ప్రవీణ్ కుమార్ కు. అప్రయత్నంగా అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. పిచ్చి ఆనందంతో నిధిపై పొర్లాడు. దోసెళ్ళతో వజ్రాలను ఎత్తి తలపై పోసుకొన్నాడు.

అరగంట గడచింది.

ఆనందం నుంచి తేరుకొన్న ప్రవీణ్‌కుమార్ తనతో తెచ్చిన బాగ్ విప్పి నింపసాగాడు.

'ఈ బాగ్‌లో బంగారం చాలు తన జీవితం హాయిగా గడిచిపోవటానికి.' అనుకొంటూ వెనక్కి తిరిగాడు.

రెండడుగులు ముందుకు వేశిన ప్రవీణ్‌కుమార్ ఎదురుగా మెట్లపైనుంచి నవ్వుతూ క్రిందకి దిగుతున్న జైరాజ్‌ను అతని చేతిలోని రివాల్వర్‌ను చూసి ఆగిపోయాడు. మరుక్షణం అతని చేతిలోని బాగ్ విసురుగా వెళ్ళి జైరాజ్ చేతిని తాకి, రివాల్వర్‌ను ఎగురగొట్టింది.

అనుకోని ఈ పరిమాణానికి ఒక్కక్షణం అప్రతిభుడయ్యాడు జైరాజ్.

వేగంగా వంగి రివాల్వర్ అందుకోబోయాడు. కాని ప్రవీణ్‌కుమార్ కాల్చిన బుల్లెట్ రివాల్వర్‌ను మరింత ముందుకు నెట్టింది.

"పిచ్చి పిచ్చి వేషాలెయ్యకు," కఠినంగా అంటూ ముందుకొచ్చి బాగ్ అందుకొన్నాడు ప్రవీణ్‌కుమార్.

జైరాజ్ రివాల్వర్ కూడా తీసుకొని జేబులో వేసుకొని అతన్ని నెట్టుకొంటూ పైకొచ్చాడు.

అవకాశం కోసం చూస్తున్న జైరాజ్ ప్రక్కకు దూక బోయాడు. కాని ముందుగానే గమనించిన ప్రవీణ్‌కుమార్ కాలు అడ్డు పెట్టడంతో ముందుకు పడ్డాడు. అతనిమెడ పట్టుకొని బయటకు ఈడ్చుకొచ్చాడు ప్రవీణ్‌కుమార్.

జాగ్రత్తగా కవర్ చేస్తూ గుట్ట క్రిందకు చేరుకొన్నా రిద్దరూ. నిధిఉన్న బాగ్‌ను గుర్రానికి తగిలించాడు ప్రవీణ్‌కుమార్.

అతని కంఠం గంభీరంగా పలికింది:

"జైరాజ్. ఓ ఐయామ్ సారీ, అజిత్, అనవసరంగా అత్యాశకుపోయి క్రిందటి జన్మలో మనిద్దరి జీవితాలు పాడుచేశావు. ఇప్పుడన్నా వివేకంగా మెలగు. మనం కనుగొన్న నిధి తక్కువేమీ కాదు. వందమంది మరో వంద తరాలపాటు కూర్చొని తిన్నా తరగనంత ఉంది. మూర్ఖతకు పోయి అనవసరంగా జీవితం పాడుచేసు కోకు."

మాట్లాడలేదు జైరాజ్. మౌనంగా తన అశ్వంవైపు కదిలాడు.

నెమ్మదిగా కదులుతున్న జైరాజ్ అశ్వం దగ్గరకు చేరుకోగానే మెరుపులా వెనక్కి తిరిగాడు. అతని చేతి లోని పదునైన బాకు తళుక్కుమంది. రెప్పపాటు కాలంలో అది ప్రవీణ్‌కుమార్ వైపు దూసుకొచ్చింది.

కాని అప్పటికే ఆలశ్యమైంది. జైరాజ్ ప్రవర్తనకును గమనించిన ప్రవీణ్‌కుమార్ కాల్చిన బుల్లెట్ జైరాజ్ గుండెలను ఛేదించింది. కాని జైరాజ్ విసిరిన బాకు

దెబ్బనుండి ప్రవీణ్ తప్పుకోలేకపోయాడు. అది సూటిగా వచ్చి గుండెలో దిగబడింది. బాధతో మెలికలు తిరిగి పోయాడు.

కొద్ది నిముషాలలో ఇరువురి ప్రాణాలు అనంతవాయువులో కల్సిపోయాయి.

ఒంటరిగా మిగిలిన అశ్వాలు రెండూ ఒకసారి బిగ్గరగా సకిలించి బయటికి దౌడుతీశాయి.

ఐపోయింది.